


అంగరంగ వైభవంగా..
తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

- 9లో ▸



గరిష్టం/కనిష్టం
35.6 /9.9

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థినులు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 38 కేంద్రాల్లో 7,949 మంది విద్యార్థులకుగాను మొదటి రోజు 7,789 మంది హాజరు కాగా, 160 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



తాడ్కోల్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్: ఇంటర్ పరీక్ష కొనసాగుతున్న మండలంలోని తాడ్కోల్ గ్రామ శివారులో ఉన్న ఠాగూర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల సెంటర్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం తనిఖీ చేశారు. సెంటర్‌లో వసతులను పరిశీలించిన ఆమె.. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కూర్చున్న చోటికే తాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

దోమకొండ: రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సులు రద్దుచేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతోపాటు ముత్యంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి వారి వద్ద ఉన్న స్టాక్, విక్రయాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ, మండల వ్యవసాయాధికారి మణిదీపిక, వ్యవసాయ విస్తీర్ణాధికారి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బైక్ సైలెన్సర్ల ధ్వంసం

ఖలీల్‌వాడి: నిబంధనలకు విరుద్ధంగా బైక్‌లకు అమర్చిన భారీ శబ్దం చేసే 240 సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బైక్ సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో తొక్కించారు. ఏసీపీ మా ట్లాడుతూ రెండు, మూడు నెలల నుంచి వాహన తనిఖీలు చేస్తూ సైలెన్సర్లను తొలగించి వారిపైన చర్యలకు ఆదేశించామన్నా రు. ద్విచక్రవాహనాలకు ప్రత్యేక సైలెన్సర్లను అమర్చితే షోరూంలతోపాటు మెకానిక్‌లు, వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడుగంటిన ఆశలు!

- వేగంగా పడిపోతున్న భూగర్భజలమట్టం
- బోర్లలో ఊట తగ్గిపోయి ఇబ్బందులు
- పంటలను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

జిల్లాలో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుండడంతో రైతుల కళ్ల ముందే పంటలు ఎండుతున్నాయి. ఎన్నోఆశలతో సాగు చేసిన వరి ఎండి మడులు నెర్రెలుబారుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల పంటను పశువుల మేతకు వదిలేస్తున్నారు.



మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం)లో రైతు సల్ల రాజేందర్ చేనులో వరిని మేస్తున్న గొర్రెలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భూగర్భజలమట్టం వేగంగా పడిపోయి బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో యాసంగి పంటలకు సాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేసి మళ్లీ బోర్లు తవ్విస్తున్నారు. చేతికందే పంట దిగుబడి ఎంతో.. మిగిలేది ఎంతో కానీ పంటను కాపాడుకునేందుకు రైతులు చేయని ప్రయత్నం లేదు. యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,97,185 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేయగా, ఇందులో వరిదే అగ్రస్థానం. 2,61,109 ఎకరాల్లో వరి వేశారు. ప్రాజెక్టులు, చెరువులు, కాలువల కింద 45 వేల ఎకరాలు పోను మిగతాదంతా బోర్లు, బావుల కిందే సాగవుతోంది. జిల్లాలో లక్షా 6 వేల బోర్లు ఉన్నాయి. సగానికిపైగా బోర్లలో నీటి ఊటలు తగ్గినట్టు అంచనా. దీంతో పంటలకు నీరందించలేని పనరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఫలితంగా పంటలు దెబ్బతింటున్నాయి. చాలాచోట్ల రైతులు పంటను కాపాడుకోలేక పశువులను మేపుతున్నారు. పెట్టుబడి కోల్పోయి కంటతడిపెడుతున్నారు. ఎండిపోయిన పంటలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతున్న బోరుబావులు



ఎల్లారెడ్డి మండలం అడివిలింగాలలో రైతు విఠల్ చేనులోని బోరు నుంచి వస్తున్న నీటిధార

బోర్లు ఎత్తిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. జనవరి నెలాఖరులో జిల్లా సరాసరి భూగర్భజల మట్టం 10.68 మీటర్లు కాగా, ఫిబ్రవరి నెలాఖరుకు వచ్చేసరికి 12.97 మీటర్ల లోతుకు పడిపోయింది. అంటే నెల రోజుల్లో 2.30 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పడిపోయినట్లు స్పష్టమవుతోంది. గతేడాది నవంబర్ నెలాఖరులో 8.43 మీటర్ల లోతులో నీరుండగా, మూడు నెలల్లో 4.55 మీటర్ల మేర పడిపోయింది. పిట్లం మండలం గోద్మేగాంలో అత్యధిక లోతు అంటే 35.62 మీటర్ల లోతుకు భూగర్భజలమట్టం పడిపోయింది. బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, కామారెడ్డి, లింగంపేట, గాంధారి, రాజంపేట, నిజాంసాగర్ మండలాల్లో 15 మీటర్ల నుంచి 20 మీటర్లకు భూగర్భజలమట్టం చేరింది. బీర్కూర్, జుక్కల్, మాచారెడ్డి, మద్నూర్, నస్రుల్లాబాద్, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్, పిట్లం, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, డోంగ్లీ, పాల్వంచ మండలాల్లో 15 మీటర్ల లోతులో ఉంది. బోర్లు ఎత్తిపోతుండడంతో రైతులు మళ్లీ బోర్లు తవ్విస్తున్నారు. 300 నుంచి 500 అడుగుల మేర తవ్వించేందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

‘సాగర్’ నీటి విడుదల నిలిపివేత

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు గురువారం సాయంత్రం నీటి విడుదలను నిలిపి వేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంట పొలాలకు గత నెల 21 నుంచి ప్రధాన కాలువ ద్వారా నాలుగు దఫాలుగా నీటిని విడుదల చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో అవసరం మేరకు నీటి విడుదలను నాలుగైదు రోజులపాటు పొడిగించారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరందడంతో నీటి విడుదలను నిలిపి వేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం1405 (17.8 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1396.96 (8.392టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. మరో రెండు దఫాలు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నారు.

యాసంగి పంటల సాగు..

పంట	ఎకరాలు
వరి	2,61,109
శనగ	59,558
మక్క	35,134
జొన్న	31,591
మినుము	2,737
పొద్దుతిరుగుడు	1,628
పల్లి	527
పొగాకు	497
గోధుమ	426



రాజంపేటలో నెర్రెలుబారిన భూమి

ఎండిపోతున్న పంటలు

భూగర్భ జలమట్టం పడిపోతుండడంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ, పాల్వంచ, రామారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్, భిక్కనూరు తదితర మండలాల్లో బోర్లు ఎత్తిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ‘సాక్షి’ క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. బోర్లలో నీటి ఊటలు తగ్గిపోతుండడంతో చాలా మంది రైతులు అదనంగా పైపులు దింపుతున్నారు. మరికొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు బోర్లు తవ్విస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు. ప్రధానంగా వరి పంటకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో వరి పొట్ట దశలో ఉంది. ఇప్పుడు పుష్కలంగా నీరు అవసరం ఉందని, ఇదే సమయంలో బోర్లు ఎత్తిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు బోర్లు తవ్వించినా..



బోర్లు ఎత్తిపోయాయి. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేసిన. రూ.70 వేలు ఖర్చయినాయి. నీళ్లు పడకపోవడంతో పంటను కాపాడలేకపోయాను. కండ్ల ముందరే పంట దెబ్బతిన్నది. ఇప్పటికే రెండెకరాల్లో ఎండిపోయింది. మిగిలింది కూడా ఎండుతోంది. పశువులకు వదిలేసిన. లాగోడి మీద పడ్డది. రెక్కల కష్టం వృథా అయ్యింది.

– సల్ల రాజేందర్, రైతు, ఘన్‌పూర్(ఎం), మాచారెడ్డి మండలం

బోరు చిన్న ధార పోస్తోంది



రెండు ఎకరాల్లో వరి వేసిన. బోరులో నీరు తగ్గిపోయి సన్నటి ధార పోస్తోంది. ఏమీ పాలుపోని పరిస్థితి ఏర్పడింది. పొట్టదశకు వచ్చిన వరిని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. లాగోడి మొత్తం మునుగుడే. పంట ఎండిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– మన్నె విఠల్, రైతు, అడవిలింగాల, ఎల్లారెడ్డి మండలం

పంటకు నీరందడం లేదు



మా సొంత భూమితోపాటు మరో 5 ఎకరాలు కౌలు తీసుకొని మొత్తం 12 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. మొదట్లో బోర్లు బాగానే పోశాయి. కొన్ని రోజులుగా బోర్లు ఆపుతున్నాయి. దీంతో పంటలకు నీరందడం లేదు. తడారడంతో పంటలు ఎండుతున్నాయి. పెట్టుబడులు మీద పడేలా ఉన్నాయి.

– బూస సింహం, రైతు రాజంపేట

అప్పు చేసి కౌలు చేస్తున్నా



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నా. పెట్టుబడి కోసం అప్పులు చేశా. వరి ప్రస్తుతం పొట్టదశలో ఉంది. బోర్లు ఆపుతున్నాయి. కళ్ల ముందే పంట ఎండిపోతోంది. పంటలు గట్టెక్కుతాయనే నమ్మకం లేదు.

– కోతి కిష్టయ్య, రైతు, రాజంపేట

ఉపాధిపై భానుడి ప్రతాపం



ఒడ్డెపల్లిలోని ఊరచెరువు కట్ట వద్ద చెట్టు కింద సేద తీరున్న కూలీలు

- క్రమంగా పెరుగుతున్న ఎండ తీవ్రత
- సౌకర్యాలు లేక కూలీల అవస్థలు

నిజాంసాగర్(జుక్కల్): ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండడంతో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఒడ్డెపల్లి ఊర చెరువులో గురువారం పనికి వెళ్లిన కూలీలు మధ్యాహ్నం 12గంటల సమయంలో ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం అక్కడున్న వేప చెట్టు కిందికి చేరారు. చెట్టు నీడ ఉన్న ప్రదేశం చిన్నగా ఉండడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌తోపాటు మిగతా కూలీలు ఎండలో నిల్చున్నారు. పని ప్రదేశాల్లో టెంట్‌లు, తాగునీటి సదుపాయం లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 527 గ్రామ పంచాయతీలకుగాను 17.75 లక్షల జాబ్‌కార్డులు 2.9 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం 19, 546 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఫిష్ పాండ్స్. భూమి అభివృద్ధి, గేదెల షెడ్ల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నారు. వారం రోజులుగా క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుండగా, పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈజీఎస్ అధికారులు ఇకనైనా స్పందించి సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- కేసుల విచారణను వేగవంతం చేయాలి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి
- పాత నేరస్తుల కదలికలపై నిఘా సారించాలి
- సమీక్ష సమావేశంలో ఎస్పీ సింధుశర్మ



సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని ఎస్పీ సింధుశర్మ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోక్సో, గ్రేవ్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్‌లు దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అన్ని స్థాయిల్లో అధికారులు దృష్టి సారించాలన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కొత్త కేసులతో పాటు పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, కేసుల సంఖ్యను తగ్గించే దిశగా పని చేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీ ల ఏర్పాటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలైన గంజాయి, జూదం, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేయాలన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాసులు, సీఐలు తిరుపయ్య, మురళి, చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, ఎస్సైలు పాల్గొన్నారు.

అడవిలో మళ్లీ మంటలు

- తాండూర్ శివారులో అగ్ని ప్రమాదం
- 15 రోజుల వ్యవధిలో ఐదోసారి..



తాండూర్ శివారులోని అడవిలో చెలరేగుతున్న మంటలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ శివారులో ఉన్న అటవీప్రాంతంలో గురువారం రాత్రి మళ్లీ మంటలు చెలరేగాయి. నాగిరెడ్డిపేట రేంజ్ పరిధిలో 15 రోజుల వ్యవధిలో ఐదోసారి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తుల చర్య కారణంగా అటవీప్రాంతంలో గురువారం సాయంత్రం మంటలు అంటుకుని క్రమంగా వ్యాపించాయి. ఈ ఘటనలో నీలగిరి చెట్లు కాలిపోయాయి. మంటలు వ్యాపించిన ప్రాంతంలోకి ఫైరింజన్ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అటవీ అధికారులు, సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు గురువారం అర్ధరాత్రి వరకు శ్రమించారు. ఇటీవలే రెండురోజులపాటు మంటలు చెలరేగిన ఘటనను మరువకముందే మళ్లీ మంటలు అంటుకున్నాయని, ఫారెస్ట్ అధికారులు స్పందించి ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసి దర్జాగా విక్రయం

- అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్ల విక్రయం
- బాన్సువాడలో నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌లు
- అన్నీ తెలిసి పట్టించుకోని అధికారులు

బాన్సువాడ : నిబంధనలను తుంగలో తొక్కుతున్న రియల్టర్లు అనుమతులు లేకుండానే బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా వెంచర్లు చేస్తున్నారు. పట్టణంలో పదుల సంఖ్యలో అక్రమ లే అవుట్‌లు కొనసాగుతున్నాయి. కొందరు రియల్టర్లు అభివృద్ధి పేరిట రైతుల పట్టా భూములను తీసుకుంటున్నారు. ఒక రైతుకు రెండు గుంటల పట్టా భూమి ఉంటే ఒక గుంట అభివృద్ధి కోసం రియల్టర్లు తీసుకుని మరో గుంట భూమిని రైతుకు ప్లాట్లుగా మార్చి ఇస్తున్నారు. వెంచర్‌లో 10 శాతం భూమిని బల్దియాకు కేటాయించాలనే నిబంధన ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోవడం లేదు. వెంచర్‌లో ఏదో ఓ మూలన పనికి రాని స్థలాన్ని బల్దియాకు కేటాయిస్తున్నట్లు దరఖాస్తులో చూపిస్తున్నారు. సాయికృపానగర్ కాలనీలో అసైన్డ్ భూమిలో అక్రమ లేఅవుట్‌ను ఏర్పాటు చేశారనే ఆరోపణలున్నాయి. బోర్లం రోడ్డులో ప్రభుత్వ భూమిలో సైతం వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంచర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేస్తున్న రియల్టర్లు అనుమతులు మంజూరుకాక ముందే ప్లాట్లను విక్రయించేస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇల్లు నిర్మించుకోవాలంటే తరువాత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) నుంచి గాని ఎలాంటి అనుమతులు లేకున్నా ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

నిబంధనలు..

సాధారణంగా లే అవుట్ ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనంతరం లే అవుట్ విస్తీర్ణంలో 15 శాతం భూమిని మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేయాలి. అయితే మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేసిన ప్లాట్లను సైతం రియల్టర్లు విక్రయిస్తున్నారు. ఇది పూర్తయ్యాకే లేఅవుట్ పనులు ప్రారంభించాలి. 40 ఫీట్ల రోడ్లతోపాటు విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలి. అనుమతులేమీ లేకుండా కేవలం మట్టి రోడ్లు వేసి ఒక్కో ప్లాటును రూ.15 లక్షల నుంచి రూ.40 లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



బాన్సువాడ పట్టణంలో ఓ వెంచర్

చర్యలు తీసుకుంటాం

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలను అతిక్రమించి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లపై చర్యలు తీసుకుంటున్నాం. ప్లాట్లను కొనుగోలు చేసే ప్రజలు లే అవుట్‌కు అధికారిక అనుమతులు ఉన్నాయా..?లేవా..? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలి.

– శ్రీహరిరాజు, ఇన్‌చార్జి కమిషనర్, బాన్సువాడ

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వాహనాల సంతలో గురువారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. షీ టీం, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తమ ఫోన్‌లో టీ–సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నెంబర్లు 1930,108, 100, 181లను ఎలా వినియోగించుకోవాలో వివరించారు.

దంత సంరక్షణ తప్పనిసరి



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: మారిన ఆహార అలవాట్లు, జీవనశైలి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దంత సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని దంత వైద్య నిపుణులు విద్యార్థులకు సూచించారు. దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రాజారం దుబ్బ మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు టూత్‌బ్రష్ వాడకం, పేస్ట్ వినియోగం, దంత సంరక్షణ చర్యల గురించి వివరించారు. ఉదయం, రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా టూత్‌పేస్ట్, బ్రష్‌లను బహూకరించారు. దంతవైద్యులు స్వాతి, సంతోష్‌రెడ్డి, సౌజన్య, సుహాసిని, అనిల్‌రెడ్డి, సందీప్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



ఓరియంటల్ స్కూల్లో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కామారెడ్డి టౌన్: డెంటల్‌డేను పురస్కరించుకుని కామారెడ్డి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఓరియంటల్ స్కూల్‌లో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యులు అభిషేక్‌రెడ్డి, కవిత, సాజీద్, సారా, క్రాంతి, నాగరాజు, శ్రావణ్, రాకేష్, ప్రవీణ్‌కుమార్‌లు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మురళీరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఇద్దరి చొప్పున(నామినేటెడ్) ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఈ చట్ట సాధన కోసం లక్ష సంతకా ల మహోద్యమాన్ని చేపడుతామని తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం వేదిక జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన జి ల్లాస్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్వరాజు, ప్రతినిధి సంగప్ప పాల్గొన్నారు.

బంగారు గొలుసు మాయం

ఖలీల్‌వాడి: హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు బస్సులో వస్తున్న సమయంలో గొలుసు పోయిందని బాధితుడు హరీశ్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. నగరంలోని గాజులపేట్‌కు చెందిన హరీశ్ హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా మెడలో ఉన్న బంగారు గొలుసు పోయింది. దీంతో ఒకటో టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

వాడిపోతున్న మొక్కలు

- ఎండల తీవ్రతకు మొలకలు రాని విత్తనాలు
- వచ్చిన మొలకలు సైతం వాడిపోతున్న వైనం



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో ఎండలో ఏర్పాటు చేసిన నర్సరీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రోజురోజుకు ముదురుతున్న ఎండల కారణంగా గ్రామ పంచాయతీల పరిధిల్లోని నర్సరీలలో పెంచుతున్న మొక్కలు వాడిపోతున్నాయి. వనమహోత్సవ కార్యక్రమ కోసం ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గల నర్సరీలో సుమారు 4 వేల చొప్పున మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం నర్సరీలలో పెంచుతున్న మొక్కలను రానున్న వర్షాకాలంలో నాటనున్నారు. మట్టితో నింపిన పాలిథీన్ బ్యాగుల్లో విత్తనాలను సైతం నాటి ప్రతిరోజూ నీటిని పడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు సమస్య ఇక్కడే మొదలైంది. ముదురుతున్న ఎండల వల్లనో లేక నాసిరకమైన విత్తనాలేమైనా తెచ్చి నాటారో తెలియదు కానీ చాలా నర్సరీలలో విత్తనాలు మొలకెత్తలేదు. కొన్నిచోట్ల వచ్చిన మొలకలు ఎండలతీవ్రతకు వాడిపోతున్నాయి.

వెంటాడుతున్న నిధుల సమస్య..

గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నర్సరీల ఏర్పాటు, నిర్వహణకు గ్రామ పంచాయతీ బడ్జెట్‌లో నుంచి గ్రీన్ ఫండ్ పేరిట కొంత మేర వెచ్చించేవారు. గత కొంతకాలంగా గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతోపాటు నిధుల కేటాయింపు జరగకపోవడంతో నర్సరీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. ఈ క్రమంలో నర్సరీలలో ఏర్పాటు చేసేందుకు నూతనంగా గ్రీన్ షేడ్ నెట్‌లను తెప్పించలేకపోతున్నారు.

జిల్లాలో 21.06 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం..

వనమహోత్సవం నిర్వహణకు ఈ యేడు జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల పరిధిల్లో సుమారు 21.06లక్షల మొక్కలను పెంచాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీలో సుమారు 4 వేల చొప్పున మొక్లను పెంచుతున్నారు.

షేడ్‌నెట్లను ఏర్పాటు చేయిస్తున్నాం

మండలంలోని నర్సరీలలో షేడ్‌నెట్లను ఏర్పాటు చేయించాలని ఇదివరకే పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. మండలంలోని కొన్ని నర్సరీలలో గతయేడు ఉపయోగించిన షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేశారు. షేడ్‌నెట్లు లేనిచోట్ల కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించాం. నాలుగైదు రోజుల్లో అన్ని నర్సరీలలో షేడ్‌నెట్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

– సాయిలు, ఈజీఎస్ ఏపీవో, నాగిరెడ్డిపేట

సమయపాలన పాటించండి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



తాడ్కోల్‌లో ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్: గ్రామస్థాయిలో అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. గురువారం ఆమె బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్‌తో కలిసి తాడ్కోల్‌లో పర్యటించారు. వనమహోత్సవం కోసం సిద్ధం చేస్తున్న నర్సరీని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి ప్రశాంతికి పలు సూచనలు చేశారు. అనంతరం పల్లె ప్రకృతివనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వప్రాథమిక విద్య అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం గురించి ఆరాతీశారు. అలాగే గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. అందుబాటులో ఉన్న మందులు పరిశీలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్య, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, ఉపాధి హామీ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



తాడ్వాయిలో ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది



గోపాల్‌పేటలో..

జిల్లాలో ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మద్నూర్ పరిధిలో ఏడుగురు విద్యార్థులు, తాడ్వాయిలో ఒకరు, నాగిరెడ్డిపేటలో 8 మంది, ఎల్లారెడ్డిలో నలుగురు, పిట్లంలో ఐదుగు రు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. –సాక్షినెట్‌వర్క్

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి



బెజుగంచెరువుతండాలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకరచారి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కొలతల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. కన్నారెడ్డి, రాఘవపల్లి, బెజుగంచెరువుతండా శివారుల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. పనులకు హాజరయ్యే కూలీలసంఖ్యను మరింత పెంచాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. టీఏలు సత్యప్రసాద్, సంతోష్, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్‌అసిస్టెంట్లు శ్రీనివాస్, పర్వీన్ తదితరులున్నారు.

కూలీల సంఖ్య పెరిగేలా చూడాలి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. గురువారం సబ్దల్‌పూర్‌లో జరుగుతున్న ఉపాధిహామి పనులను ఆయన పరిశీలించారు. పని ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏపీవో వినోద్ తదితరులున్నారు.

నల్లమడుగులో పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. కూలీలు ఎక్కువ మంది పనుల్లో పాల్గొనే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.



నల్లమడుగులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేష్

తెయూ సైన్స్ డీన్‌గా సంపత్ కుమార్ నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫ్యాకల్టీ అఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ సంపత్‌కుమార్ నియమితులయ్యారు. తెయూ వీసీ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం సంపత్‌కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. స్టాటిస్టిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్న సంపత్‌కుమార్ ప్రస్తుతం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో డీన్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా లక్ష్మణచక్రవర్తి ..

తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి నియమితులయ్యారు. తెయూ వీసీ యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి గురువారం లక్ష్మణ చక్రవర్తికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతిగా లక్ష్మణ చక్రవర్తి విధులు నిర్వహిస్తున్నాడు. లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఖాయం



లింగంపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబురాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

లింగంపేట(ఎల్లారెడ్డి): రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం రాత్రి లింగంపేట మండల కేంద్రంలో ఎమ్మెల్సీల గెలుపు సందర్భంగా ఏర్పాటు చేసిన సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ రావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఇన్‌చార్జి హైమవతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మురళి, తదితరులు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

- అధికారులకు 7టిప్పర్లు, పొక్లెయిన్ అప్పగింత

రెంజల్(బోధన్): అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ మొరం తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన మండలంలో నీలా గ్రామంలో చోటుచేసుకుంది. మొరం టిప్పర్లతోపాటు పొక్లెయిన్‌ను పట్టుకొని, రాత్రంత చెరువు వద్దనే జాగారం చేసి, అధికారులకు అప్పగించారు. రెంజల్ మండలం నీలా ఖజానా కుంట నుంచి రాత్రి సమయంలో అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలుసుకున్నారు. దీంతో బుధవారం రాత్రి చెరువు వద్దకు చేరుకొని మొరం తరలించేందుకు సిద్ధంగా ఉన్న 7టిప్పర్లతో పాటు పొక్లెయిన్‌ను అడ్డుకున్నారు. అధికారులు రాకపోవడంతో గ్రామస్తులు అక్కడే నిద్రించారు. ఇరిగేషన్ అధికారులు, పోలీసులు గురువారం చెరువు వద్దకు చేరుకోవడంతో వారితో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నా రాత్రి సమయంలో తరలించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వ పనుల పేరుతో మొరంను అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బోధన్ సబ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో గ్రామస్తులు పట్టుకున్న వాహనాలను పోలీసుకులకు అప్పగించారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



ఘటన స్థలంలో విఠల్ మృతదేహం

మాక్లూర్: జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న ఓ కూలీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుత్ప శివారులోగల 63వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరుగగా... మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. గత రెండు రోజులుగా జాతీయ రహదారిపై ప్యాచ్ వర్కు పనులు జరుగుతున్నాయి. గుత్ప శివారులోని జాతీయ రహదారిపై గవారే విఠల్ (45) అనే కూలీ ప్యాచ్ వర్కు చేస్తున్నాడు. ఈక్రమంలో వేడి చేసిన డాంబర్ కోసం అతడు రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ వైపు నుంచి ఆ ర్మూర్ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో విఠల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- **రైలు ఢీకొని వృద్ధుడు..**

ఖలీల్‌వాడి: రైలు పట్టాలు దాటుతుండగా ఓ వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ హరికృష్ణ, రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లమ్మగుట్టకు చెందిన బొందెలు ప్రతాప్‌సింగ్ (60) పూలాంగ్ వాగు బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

- **చెరువులో పడి వివాహిత మృతి**

సిరికొండ: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వివాహిత మృతి చెందిన ఘటన సిరికొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రామ్ తెలిపిన వివరాలు ఇలా.. నెల్లూరు జిల్లా, గంగులవారి చెరువుపల్లి గ్రామానికి చెందిన దంపతులు తిన్నవెల్లి అశోక్ కుమార్, బొంతల పూజ సిరికొండలో ఒక మేస్త్రి వద్ద కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పూజ మూడు రోజుల క్రితం తన పుట్టింటికి వెళ్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే ఆమె పుట్టింటికి చేరలేదని తెలియడంతో భర్త అశోక్ కుమార్ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సిరికొండలోని ఎల్లమ్మ చెరువులో గురువారం మహిళ మృతదేహం లభ్యమైంది. అది పూజ మృతదేహంగా అశోక్ కుమార్ నిర్ధారించినట్లు ఎస్సై తెలిపారు. కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయినట్లు భర్త అశోక్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- **మద్యం తాగి.. స్పృహతప్పి ఒకరు..**



రాములు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): ఓ వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి, స్పృహ తప్పి మృతిచెందిన మహమ్మద్ నగర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాగి రాములు (45) బుధవారం మహమ్మద్ నగర్ మండలం ముగ్దుంపూర్ గ్రామంలో ఓ పెళ్లి వేడుకకు వచ్చాడు. అతడు ఫుల్లుగా మద్యం తాగి పెళ్లి కూతురును తీసుకురావడానికి వెళ్తానని చెప్పడంతో బంధువులు వద్దని వారించారు. అనంతరం పెళ్లి కొడుకు తల్లిదండ్రులతో గొడవపడటంతో అతడి భార్య తులసమ్మ సర్దిచెప్పి రాములును అదేరోజు రాత్రి ఎల్లారెడ్డికి తీసుకెళ్లింది. కానీ అప్పటికే అతడు స్పృహ తప్పడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అతడు మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నిజామాబాద్ రూరల్: మండలంలోని గొల్లగుట్ట తండా దర్గా వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ గురువారం తెలిపారు. దర్గా దగ్గర ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ వద్ద వ్యక్తి మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. మృతుడు సుమారు 40–50 ఏళ్ల వయస్సు ఉంటాడని తెలిపారు. ఎవరైన మృతుడిని గుర్తించినట్లయితే రూరల్ ఎస్‌హెచ్‌వో ఫోన్ నంబర్ 8712659849కు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 8712659847కు సంప్రదించాలని కోరారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కోతుల దాడిలో ఓ వ్యక్తి గాయపడినట్లు స్థానికులు గురువారం తెలిపారు. సంగయ్య అనే వ్యక్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సమయంలో అకస్మాత్తుగా కోతులు సంగయ్యపై దాడి చేసి కరవడంతో అతడి కాలుకు తీవ్రగాయం అయింది. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్‌శాఖ దాడులు

రాజంపేట: మండలంలోని గుండారంలో బెల్ట్‌షాపులపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు షాపులను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీపిక తెలిపారు. 4.48 లీటర్ల మద్యం, 3.9లీటర్ల బీర్లను సీజ్ చేసినట్లు వివరించారు. కానిస్టేబుళ్లు జీవన్, మహేష్, బాలరాజు ఉన్నారు.

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రా మంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు గురువా రం తెలిపారు. గ్రామానికి చెందిన సైదుగారి శ్రావణ్ (23) కల్లుబట్టిలో కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతడికి గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. మద్యానికి బాని సై పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రావణ్ పశువులకొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మాక్లూర్: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి సాయమ్మ(35), తన భర్తతో గొడవపడింది. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం కుటుంబ కలహాల కారణంగా ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. మంటలు చెలరేగగా వెంటనే స్పందించిన స్థానికులు మంటలను ఆర్పివేసి, ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, 50 శాతం గాయాలు అయినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరెపల్లి వాగు వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అడవిపందుల దాడిలో మక్కపంట ధ్వంసం



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అడవిపందుల దాడిలో మక్క పంట ధ్వంసం అయ్యింది. గురువారం వేకువజామున గ్రామానికి చెందిన మంద చిన్ననర్సింలుకు చెందిన మక్కపంటలో అడవి పందులు దాడిచేశాయి. దీంతో మూడు ఎకరాల పంట ధ్వంసం అయినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నిజామాబాద్ సిటీ: రేషన్ బియ్యం రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మోపాల్ మండలం సిర్పూర్ గ్రామ శివారులో భాజ మహేష్ అనే వ్యక్తి బైక్‌పై బియ్యం తరలిస్తుండగా సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీచేశారు. 2.32 క్వింటాళ్ల రేషన్ బియ్యంగా నిర్ధారించారు. మహేష్‌ను విచారించగా.. గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యం తక్కువ రేటుకు కొని నిజామాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపాడు. అనంతరం బియ్యంతో పాటు మహేష్‌ను సివిల్ సప్లయ్ అధికారులు మోపాల్ పోలీసులకు అప్పగించారు. మోపాల్ ఎస్ఐ యాదగిరి కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్ వద్ద ఆగిఉన్న పాఠశాల బస్సును లారీ ఢీకొట్టింది. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్ వద్ద గురువారం విద్యార్థులు రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో వాహనాలతోపాటు స్కూల్ బస్సు ఆగి ఉండగా వెనుక నుంచి లారీ వచ్చి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు ముందున్న వాహనాలను ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో పలువురి వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కారణమైన లారీ యజమానిపై కేసు నమోదు చేశామని, తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.